నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 3 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

## 5కే రన్‌లో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పిలుపు




5కే రన్‌లో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 2 : 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవడంతోపాటు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో ఖమ్మంలో 5 కే రన్ నిర్వహించారు. సర్దార్ పటేల్ స్టేడియం వద్ద కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్ జెండా ఊపి పరుగును ప్రారంభించారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, నగర ప్రముఖులు, యువతీ యువకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని 5కే రన్ విజయవంతం చేశారు. పటేల్ స్టేడియం నుంచి బయలుదేరి లకారం పార్కు వరకు పరుగెత్తగా.. ప్రతిభ కనబరిచిన నలుగురికి కలెక్టర్ గౌతమ్ నగదు బహుమతిని అందజేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 14వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. సీ విజిల్ యాప్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని తక్షణమే డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఓటు ఎక్కడుందో ఇట్టే తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ మయాంక్ సింగ్, యువరాజ్, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, డీవైఎస్‌వో తుంబూరి సునీల్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ కోచ్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం కనెక్షన్‌పై అవగాహన ఉండాలి

- ఎన్నికల విధుల నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాలి
- మొదటి శిక్షణకు హాజరుకాని సిబ్బందికి షోకాజ్ నోటీసులివ్వాలి
- పీవోలు, ఏపీవోల శిక్షణ తరగతుల్లో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక




ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ/ పాల్వంచ రూరల్, ఏప్రిల్ 2: ఈవీఎం కనెక్షన్‌పై అవగాహన కలిగి ఉండాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక సూచించారు. పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈవీఎం పరికరాల పనితీరు గురించి పీవో, ఏపీవోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురి కాకూడదని అన్నారు. పోలింగ్ రోజున పూరించాల్సిన 17సీ, పీవో డైరీ, పీవో రిపోర్టులతోపాటు ఈవీఎం కనెక్షన్ మీద స్పష్టమైన అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా ఎన్నికల సిబ్బంది వ్యవహరించాలని ఆదేశించారు. ఈ రోజున నిర్వహిస్తున్న మొదటి శిక్షణ కార్యక్రమానికి కొత్తగూడెం నుంచి 275 మంది, అశ్వారావుపేట నుంచి 264 మంది, ఇల్లెందు నుంచి 225 మంది, పినపాక నుంచి 260 మంది, భద్రాచలం నుంచి 209 మంది కలిపి మొత్తం 1,233 మంది హాజరు కావాల్సి ఉందని తెలిపారు. అయితే ఇందులో 48 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు దామోదర్‌రావు, కుసుమకుమారి, సుమ, శ్రీనివాస్, వివేక్, ఎర్రం చిన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాడ నగర్ 'అసైన్డ్' రైతులకు తాఖీదులు

- భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు అధికారుల నోటీసులు
- ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న రైతుల ఆందోళన
- ఇప్పటికిప్పుడు ఇదేమిటంటూ ప్రభుత్వ తీరుపై మండిపాటు



తహసీల్దార్ జారీ చేసిన నోటీసు

రఘునాథపాలెం, ఏప్రిల్ 2: ఎంతోమంది పేదలు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములవి. పోడు చేసుకున్నందుకుగాను నాటి ప్రభుత్వం వాటిపై హక్కులు కల్పించి అసైన్డ్ చేసింది. దీంతో ఆ భూములను వారు, వారి వారసులు కాలక్రమేణా వారి తాతల కాలం నుంచి వారసత్వంగా సాగు చేసుకుంటూ వస్తున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి 2016లో నాడు సాగులో ఉన్న రైతులకు ఆ అసైన్డ్ భూములకు పాస్ పుస్తకాలను పంపిణీ చేసింది. అంతే కాదు.. పెట్టుబడి సాయంగా రైతుబంధునూ అందించింది. దీంతో పేదలు ఆ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. కానీ, ఇటీవలి కాంగ్రెస్ ప్రభుత్వం.. సదరు రైతు కుటుంబాలను రోడ్డున పడేసే పరిస్థితికి తీసుకొచ్చింది. ఒకరిద్దరు చేసిన తప్పులను బూతద్దంలో చూపిస్తూ ఆ ప్రాంత రైతుల భూములన్నీ స్వాధీన పర్చుకునేందుకు సిద్ధమైంది. అంతేకాదు.. రైతులకు తాఖీదులను జారీ చేసింది. రఘునాథపాలెం మండలం కోయచలక రెవెన్యూ పరిధి పువ్వాడ నగర్‌లోని 192 సర్వే నెంబర్‌లో రైతుల భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు నోటీసుల జారీ చేయడంతో పేద రైతులందరూ ఆందోళన చెందుతున్నారు.

కోయచలక రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 192లోని ప్రస్తుత పువ్వాడ నగర్ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో నాటి రైతులు పోడు చేసుకొని జీవనం సాగిస్తుండేవారు. దీంతో 1959లో అప్పటి ప్రభుత్వం వందల ఎకరాలను రైతులకు అసైన్డ్‌గా పట్టాలు పంపిణీ చేసింది. కాగా, వాటినే సాగు చేసుకుంటూ రైతులు, వారి వారసులు జీవనం సాగిస్తున్నారు. గత 20 ఏళ్ల క్రితం కొంతమంది రైతుల నుంచి భూములను సేకరించిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. కొంతభూమిని స్వాధీన పర్చుకొని ప్లాట్లు చేసి ఖమ్మం నగరంలోని పేదలకు ఇందిరమ్మ పథకం కింద పట్టాలను పంచి ఇచ్చింది. కాగా, మిగిలిన రైతులు సాగు చేసుకుంటూ ఉన్నారు. అయితే మిగిలిన రైతులు సాగు చేసుకుంటుండగా గత కేసీఆర్ ప్రభుత్వం 2016లో సాగులో ఉన్న రైతులను గుర్తించి ధరణి పాస్ పుస్తకాలను జారీ చేసింది. అయితే సదరు పాసు పుస్తకాలను అందుకున్న రైతులందరి భూములను స్వాధీన పర్చుకుంటున్నట్లు రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్ మంగళవారం 30మంది రైతులకు నోటీసులను జారీ చేశారు. అప్పట్లో అసైన్డ్ పట్టాలు పొందిన వారిలో ఒకరిద్దరు తమ భూములను అమ్ముకున్నట్లు గుర్తించిన అధికారులు.. ఇప్పుడు సాగులో ఉన్న రైతులందరికీ నోటీసులు జారీ చేశారు. దీంతో అసలైన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు అమ్ముకున్న వారిపై విచారణ చేయాలని, అంతేగానీ సాగులో ఉన్న రైతుల భూములను లక్కోవద్దని బాధితులు వేడుకుంటున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీలు నామా, వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా

# ఎకరానికి రూ.25 వేలు

# నష్టపరిహారం ఇవ్వాలి

- సాగునీటి కొరతతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- ఉద్దేశపూర్వకంగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం విషప్రచారం చేసింది
- ఎన్నికల భయంతో కాళేశ్వరం మోటర్లను ఆన్‌చేసింది
- లోక్‌సభ ఎన్నికల్లో 17 స్థానాల్లో బీఆర్ఎస్‌దే విజయం
- విలేకరుల సమావేశంలో ఎంపీలు నామా, వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ, ప్రతినిధి) : సాగునీటి కొరత కారణంగా ఎండిపోయిన వరి, మొక్కజొన్న రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాలని ఖమ్మం పార్లమెంటు సభ్యుడు నామా నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లాలో ఎంపీ నామా ఆధ్వర్యంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మండల పార్టీల అధ్యక్షులు మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడారు. రైతులు, ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ప్రజలకు అన్యాయం జరగకుండా ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోయాలనే ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. పంటలకు నీళ్లు ఇవ్వకపోవడంతో ఎండిపోయే దుస్థితికి వచ్చాయన్నారు. దీనిపై ఖమ్మం జిల్లాలో పంట నష్టపోయిన రైతుల పంటలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించామని తెలిపారు.

### వెంటనే సర్వే చేపట్టాలి
### – ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నీళ్లు లేక పంటలు ఎండిపోయిన రైతులకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించేందుకు వెంటనే సర్వే చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పెద్దఎత్తున రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

### ఎన్నికల భయంతో మోటర్లు ఆన్‌చేసింది
### – ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బదనాం చేయాలనే దురుద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పేర్కొన్నారు. కానీ నేడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గులేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు ఎత్తిపోసిందని గుర్తుచేశారు. నేడు రైతులు పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతుంటే ఎన్నికల సమయంలో గ్రామాల్లో తిరగలేమనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం తమను రక్షించుకునేందుకు మోటర్లను ఆన్ చేసి నీళ్లు ఎత్తిపోసి తెలంగాణ రైతాంగానికి నీళ్లు అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. నాడు లేని నీళ్లు.. ఇప్పుడు ఎక్కడినుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిందని.. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఘోరంగా ఓడించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధమయ్యారన్నారు. కర్రుకాల్చి వాతపెట్టేందుకు రెడీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ పార్టీ మూడోస్థానంలో ఉన్నట్లు తాజాగా ఓ సర్వే నివేదికలో తేల్చిందన్నారు. సమావేశంలో మాజీ శాసనసభ్యుడు బానోతు మదన్‌లాల్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య, ఖమ్మం రూరల్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, రఘునాథపాలెం మండల పార్టీ అధ్యక్షుడు అజ్మీర వీరూనాయక్, తొలుపునూరి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎండిన పంటలకు పరిహారం ఎప్పుడిస్తరు?

- జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా రైతులపై నిర్లక్ష్యం
- వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు
- ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలని భద్రాద్రి కలెక్టర్‌కు వినతి



భద్రాద్రి కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నా అధికార పార్టీ చోద్యం చూస్తున్నదని, ఎండిపోతున్న పంటలకు పరిహారం ఎప్పుడు ఇస్తారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ప్రశ్నించారు. మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద నుంచి మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియానాయక్, తాటి వెంకటేశ్వర్లు, దిండిగల రాజేందర్, నాయకులు కలిసి కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్ ప్రియాంక ఆలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద రేగా కాంతారావు విలేకరులతో మాట్లాడారు. రైతులు పుట్టెడు కష్టాల్లో ఉన్నా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదన్నారు. చెప్పుకోవడానికి జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా పంట పొలాలను చూసే నాధుడే లేడన్నారు. పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనీసం ఆ కుటుంబాలను పరామర్శించి ఓదార్చిన వారే లేరన్నారు. ఇల్లెందు, పాల్వంచ మండలాల్లో రైతు కుటుంబాలు అప్పులు చేసి ఆత్మహత్య చేసుకున్నారని, వారికి ఇంతవరకు పరిహారం ఇవ్వలేకపోయారన్నారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులైనా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వరి పంటకు మద్దతు ధరపై బోనస్ ప్రకటించినా నేటికి ఇవ్వలేక పోతున్నారన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో జనం తాగునీటి కోసం అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతులను చిన్నచూపు చూస్తే ఊర్కునేది లేదన్నారు. మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే కేసీఆర్ పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు లాభం కలిగేలా చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయలేక పోతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ నాయకులకు నిద్ర ఎలా పడుతుందని ఆమె ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మోరే భాస్కర్, అనుదీప్, ఎంపీపీ శాంతి, మానె రామకృష్ణ పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతకు గురికాకుండా..
# ప్రజలు రక్షణ చర్యలు పాటించాలి

- అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలి
- అన్ని ఆసుపత్రుల్లోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలి
- అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు తగు రక్షణ చర్యలు పాటించాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక సూచించారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కొత్తగూడెం ఐడీవోసీ నుంచి మంగళవారం నిర్వహించిన అన్ని మండలాల వైద్యాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు తగు రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందువల్ల ఆస్పత్రిలో అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలు ఎండ దెబ్బతగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకే పనివేళలు ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. రానున్న రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం ఉన్నందున వేసవిలోపాటించాల్సిన అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు సిద్ధం చేయాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ప్రజలెవరూ బయటికి రావొద్దని, అత్యవసరమైతే తప్ప బయట ఉండవద్దని, అయినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వీసీలో వివిధ శాఖల అధికారులు విద్యాచందన, కృష్ణగౌడ్, శిరీష, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లా వర్సిటీ సాధన సమితి ఏర్పాటు

## ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ యూనివర్సిటీ సాధన సమితి ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 2: ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ యూనివర్సిటీ సాధన సమితి ఏర్పాటైంది. సమితి కన్వీనర్‌గా ఓయూ విద్యార్థి నాయకులు ఎస్.నాగేశ్వర్ రావు, కో కన్వీనర్‌గా ఎస్.సుమంత్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఖమ్మం జిల్లాకు చెందిన ప్రొఫెసర్లు బాధ్యతలు నిర్వర్తిస్తారు. యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనే సాధన సమితిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం, వారు సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి పదేళ్లు గడుస్తున్నా నేటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వర్సిటీ లేకపోవడం బాధాకరమన్నారు. భౌగోళికంగా, విద్యాపరంగా అనువైన ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన పరిశోధనలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి ఖమ్మం జిల్లాను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆమంచి నాగేశ్వర రావు, సీహెచ్ వంశీధర్, గుమ్మడి అనూరాధ, విద్యార్థి నాయకులు నాగేశ్వరరావు, సుమంత్, రుక్మత్ పాషా, అంజి, సంపత్, మేఘన, సిరి, క్రాంతి పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటర్ల జాబితా రెడీ

- జిల్లావ్యాప్తంగా 36,926 మంది ఓటర్లు
- గత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నది 40 వేల మంది
- ఓటరు నమోదు గడువు ముగియడంతో ఆన్‌లైన్ వెబ్‌సైట్ నిలిపివేత
- రేపు తుది జాబితాను విడుదల చేయనున్న కలెక్టర్



ఎమ్మెల్సీ ఓటు హక్కును పట్టభద్రుల ఇంటికి వెళ్లి పరిశీలిస్తున్న బీఎల్‌వో

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పట్టభద్రులు ఓటు హక్కు కోసం చేసుకున్న దరఖాస్తులను స్వీకరించిన అధికారులు ఇంటింటికీ తిరిగి విచారణ చేపట్టి ఓటర్ల తుది జాబితాను రూపొందించారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా విచారణ చేసిన బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో) దరఖాస్తులు సరైనవి అని తేల్చడంతో జిల్లావ్యాప్తంగా 40,492 దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించారు. వీటిలో ఆయా నియోజకవర్గాలవారీగా పరిశీలన పూర్తి చేసిన అధికారులు తుది జాబితాను సిద్ధం చేశారు. మహిళలు 20,900 మంది, పురుషులు 16,026 మంది.. మొత్తం 36,926 మందికి ఓటు హక్కు ఉన్నట్లు గుర్తించిన అధికారులు అధికారికంగా ప్రకటనను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులలో వివిధ కారణాలరీత్యా 3,566 మంది దరఖాస్తులను తిరస్కరించగా.. 2,111 మంది దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. పట్టభద్రుల ఓటరు నమోదుకు చివరి తేదీ ముగియడంలో ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను కూడా అధికారులు నిలిపివేశారు.

### ఈ నెల4 ఫైనల్ పబ్లికేషన్..

ఫిబ్రవరి 6వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రారంభించిన అధికారులు మార్చి 22వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అయినా చాలా మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎందుకనో ఆసక్తి చూపించలేదు. ఓటు హక్కు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు అవగాహన కల్పించినా నమోదు శాతం పెరగలేదు. అయితే ఉద్యోగులు, నిరుద్యోగులు ఓటు హక్కుకు అర్హత ఉండి కూడా నమోదు చేసుకోలేదు. ఇందులో అధికారుల అలసత్వం ఉందా.. లేదా ప్రచార లోపమా.. అనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలో 40 వేలకు మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కానీ.. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆసక్తి లేకపోవడమా.. లేక ఓటుపై ధన ప్రభావం పడడం వల్లనోగానీ పట్టభద్రులు కొందరు తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నారు. వెరసి ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల సంఖ్య తగ్గినట్టే అనిపిస్తోంది.

### ఎన్నికల నోటిఫికేషనే తరువాయి..

ఎన్నికల సంఘం ఇచ్చిన తేదీల ప్రకారం జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదును పూర్తి చేసిన అధికారులు చకచకా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఈ నెల 4వ తేదీన ఫైనల్ పబ్లికేషన్ ప్రకటన చేయడానికి కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు ప్రక్రియను పూర్తి చేసి ఉంచారు. 4న అధికారికంగా కలెక్టర్ ప్రియాంక ఆల జాబితాను ప్రకటించనున్నారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ ఆలస్యమైతే మరోసారి ఓటర్ల నమోదుకు గడువు పెంచుతారా.. లేదా ఇదే ఫైనల్‌గా ఉంటుందా.. అనేది ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని బట్టి ఉంటుంది.

# 'పీఎం శ్రీ'కి నారంవారిగూడెం పాఠశాల

- సమగ్ర విద్యాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన కేంద్రం
- గత కేసీఆర్ ప్రభుత్వంలో 'మన ఊరు-మన బడి' కింద అభివృద్ధి



నారంవారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

అశ్వారావుపేట, ఏప్రిల్ 2 : కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా-ప్రధానమంత్రి భారతీయ వికసిత్ విద్య) పథకం కింద నారంవారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పాఠశాలకు ఐదేళ్లపాటు ఏటా రూ.75 వేలు, ఒక్కో విద్యార్థికి యూనిఫాం కుట్టేందుకు రూ.100, విద్యార్థినులకు ప్రత్యేకంగా రాణి రుద్రమ ఆత్మ రక్షక్ ప్రశిక్షణ్‌కు రూ.15 వేల చొప్పున నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులతో మండల విద్యాశాఖ ప్రత్యేకంగా విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించనున్నది. 2023-24 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఈ పాఠశాలను ఎంపిక చేయగా.. రెండు రోజుల క్రితం నిధులు విడుదల చేసింది. పాఠశాల ఆధునీకరణకు 'ఎంపీ శ్రీ' నిధులు దోహదపడతాయని హెచ్‌ఎం చంద్రశేఖర్ తెలిపారు.

### గత కేసీఆర్ ప్రభుత్వంలో రూ.27 లక్షల నిధులు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం మన ఊరు-మన బడి పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. ఈ పథకం కింద రూ.27 లక్షలు మంజూరు కాగా.. పాఠశాలకు అవసరమైన అభివృద్ధి పనులను అధికారులు పూర్తి చేశారు. పాఠశాలలో రెండస్థుల భవనం, రెండు తరగతి గదులు, ఆఫీస్ గది, 10 నల్లాలతో తాగునీరు, పోలింగ్ బూత్ గదికి శాశ్వత మరమ్మతులు, వంట గది, బాలికలకు టాయిలెట్స్, గ్రీన్ బోర్డులు, ప్రతి తరగతి గదికీ 4 ఫ్యాన్లు, ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, ఫ్లోరింగ్, స్థూపం వంటి అభివృద్ధి పనులను పాఠశాల విద్యా కమిటీ పూర్తి చేసింది. దీంతో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం 'పీఎం శ్రీ' పథకం కింద మంజూరైన నిధులు మరింత అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటాయని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు.